క్లుప్తంగా

అంబాపురంలో ఇంటింటి ప్రచారం



అంబాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌లకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం అంబాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. సంక్షేమ పథకాల రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో గొడ్డళ్ల వెంకటేశ్వరరావు, బి.అరుణ్‌కుమార్, గొడ్డళ్ల రోజారమణి, తోడేటి కిరణ్, భరత్, కన్వీనర్లు పాల్గొన్నారు.

దుకాణదారులకు వక్ఫ్ బోర్డు నోటీసుల జారీ



పెనమలూరు: యనమలకుదురులో జన్నతుల్ బకి కబరస్తాన్, మజీద్ ఏ ఫైజ్ ఆవరణలో ఉన్న దుకాణాల లీజు యజమానులకు వక్ఫ్ బోర్డు అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈద్గా ప్రాంగణాన్ని వక్ఫ్ బోర్డు పరిధిలోకి తీసుకువస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ముఖ్య కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 26 దుకాణాల లీజుదారులు ఇక మీదట అద్దెను వక్ఫ్ బోర్డుకు మాత్రమే చెల్లించాలని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి దుకాణాల లీజు యజమానులకు కృష్ణా జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ నహాలీషా, అడిషనల్ వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ కరీముల్లా నోటీసులు జారీ చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప చిన్న వంతెన ప్రాంతంలో మోకా నాగేంద్రరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతను తాపీ పని చేస్తాడు. కాగా నాగేంద్రరావు, భార్య మోకా నాగలక్ష్మి ఈ నెల 23వ తేదీన ఇంట్లో నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి భార్య నాగలక్ష్మి కనిపించలేదు. ఆమె కోసం బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ శ్రేణుల అత్యుత్సాహంతో ఇబ్బందులు



గన్నవరం: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ సందర్భంగా సామాన్య ప్రజానీకంతో పాటు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నామినేషన్ నిమిత్తం వచ్చిన ఆ పార్టీ శ్రేణులు జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపి వేసి హంగామా సృష్టించారు. దీనితో జాతీయ రహదారిపై కిలోమీటర్లు పొడవునా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు మండుటెండలో నరకం చూశారు. ఈ ట్రాఫిక్‌లో రోగులను తీసుకువెళ్తున్న కొన్ని అంబులెన్స్‌లు కూడా ఇరుక్కుపోయాయి. గంట పాటు అంబులెన్స్‌లు రోడ్డుపై నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినప్పటికి టీడీపీ శ్రేణులు సహకరించకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పలేదు.

డబ్బు, మద్యం, బిర్యానీ పంపిణీ

యార్లగడ్డ నామినేషన్ ర్యాలీ నిమిత్తం టీడీపీ నేతలు గ్రామాల నుంచి జనసమీకరణ చేశారు. ఒక్కొక్కరికి రూ.300 నగదు, బిర్యానీ, మద్యం పంపిణీ చేశారు. జనాన్ని ఆటోలు, ట్రాక్టర్లలో గన్నవరానికి తరలించారు. బైక్‌లపై వచ్చిన వారికి అదనంగా రూ.150 చొప్పున పెట్రోల్‌కు చెల్లించారు. మిట్ట మధ్యాహ్నం నామినేషన్ కార్యక్రమం పెట్టడంతో ప్రజలు ఎండ బారిన పడి అల్లాడిపోయారు.

2027 నాటికి మలేరియా రహిత సమాజానికి కృషి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 2027 నాటికి మలేరియా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25వ తేదీ వరల్డ్ మలేరియా డేను పురస్కరించుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమన్నారు.

అట్టహాసంగా జోగి రమేష్ నామినేషన్ దాఖలు

- నామినేషన్‌కు పోటెత్తిన జనం
- జై జగన్.. జై జోగి నినాదాలతో దద్దరిల్లిన పెనమలూరు
- అడుగడుగునా ప్రజల నీరాజనాలు



నామినేషన్ ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

అంబరాన్నంటిన సంబరం



పార్టీ జెండాతో స్కేటింగ్ చేస్తున్న అభినయ్‌రామ్

పెనమలూరు: జోగి రమేష్ నామినేషన్ ర్యాలీ అంబరాన్నంటింది. ఉయ్యూరుకు చెందిన చిన్నారి అభినయ్‌రామ్ ఎండను సైతం లెక్కచేయకుండా స్కేటింగ్ చేస్తూ పెనమలూరు ర్యాలీలో పాల్గొన్నాడు. జోగి రమేష్ తనయులు రాజీవ్, రోహిత్, 10 రూపాయల డాక్టర్ నూరి పర్వీన్ గుర్రాలపై సవారీ చేశారు. అభిమానులు జేసీబీ పైకి ఎక్కి డ్యాన్స్‌లు చేస్తూ జోగిని పూలతో ఆహ్వానించారు. యువత బైక్‌లపై విన్యాసాలు చేశారు. కార్లు, బస్సులపైకి అభిమానులు ఎక్కి జగనన్న, జోగి రమేష్ ఫొటోలతో నినాదాలు చేసి ర్యాలీలో జోష్ నింపారు.

పెనమలూరు: కృష్ణా జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పెనమలూరు నియోజకవర్గం బుధవారం జన సునామిని తలపించింది. తరలి వచ్చిన అశేష ప్రజానీకంతో పెనమలూరు ప్రభంజనంగా మారింది. జై జైగన్.. జై జోగి అంటూ పార్టీ శ్రేణులు నినదించారు. దారి పొడవునా ఎక్కడ చూసినా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా జోగి రమేష్ బుధవారం పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నలుమూలల నుంచి భారీగా తరలిరావటంతో పెనమలూరు దద్దరిల్లింది. తాడిగడప 100 అడుగుల రోడ్డు నుంచి చేపట్టిన ర్యాలీ పోరంకి, పెనమలూరు సెంటరు మీదుగా ఆర్వో కార్యాలయం వరకు సాగింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్, భార్య శకుంతలాదేవి, కుమారులు రాజీవ్, రోహిత్, కుమార్తె రేష్మ ప్రియాంక, పార్టీ నేతలు ప్రత్యేక వాహనంపై తాడిగడప సెంటర్ నుంచి బయలుదేరారు. ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు ర్యాలీగా వచ్చారు. జోగి రమేష్ తన నామినేషన్‌కు ప్రతీ ఇంటి నుంచి అభిమానులు రావాలని ప్రత్యేకంగా ఆహ్వాన పత్రాలు పంపారు. దీనికి స్పందించిన ప్రజానీకం స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రత్యేక హారతులు ఇచ్చి, గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. అడుగుడుగునా పూలతో నీరాజనాలు పలికారు. జోగి రమేష్ పోరంకి శివాలయం, మేరీమాత చర్చి, ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తన విజయానికి ఆశీర్వాదం పొందారు.

అడుగడుగునా జన నీరాజనం..

మంత్రి జోగి రమేష్ నామినేషన్ ర్యాలీకి ప్రజలు నీరాజనాలు పలికారు. పోరంకి సెంటర్ నుంచి పెనమలూరు గ్రామానికి ఎడ్లబండిపై సాగిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీలో జోగి గెలుపులో మేముసైతం అంటూ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఫ్లెక్సీలు ప్రదర్శించి తమ మద్దతు తెలిపారు. సీఎం జగన్, మంత్రి జోగితో పాటుగా ఎన్టీఆర్ చిత్రాలతో కూడిన బ్యానర్‌లతో అభిమానులు ర్యాలీలో పాల్గొని అభిమానాన్ని చాటారు. తాడిగడప నుంచి పెనమలూరుకు రావటానికి ర్యాలీ దాదాపు మూడున్నర గంటలు పట్టింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు కదంతొక్కి జోగి రమేష్ గెలుపునకు ప్రజలు మద్దతు ప్రకటించి ఆశీర్వాదం తెలిపారు. ఆర్వో రాజుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నామినేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్క అభిమానికి పాదాభివందనాలు తెలిపారు. జిల్లాలో జగన్ పాలనలో మార్పు కనబడుతుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో తూర్పు బైపాస్, విజయవాడ–మచిలీపట్నం ఆరు లైన్ల రోడ్డు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి, బందరు పోర్టుతో చిన్నపరిశ్రమలు ఏర్పాటు, ఇలా అభివృద్ధి పనులతో పెనమలూరు నియోజకవర్గం దశదిశ మారనుందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు కుమారుడు రామ్‌చరణ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, జెడ్పీటీసీ బాకీబాబు, టిడ్కో డైరెక్టర్ రాఘవరావు, నేతలు అన్నే చిట్టిబాబు, రాచూరి చిరంజీవి, దేవభక్తుని సుబ్బారావు, దేవినేని స్మిత, దేవినేని గౌతమ్, సర్పంచి లింగాల భాస్కరరావు చాంద్‌బాషా, సిద్ధిఖ్, శీలంశ్రీరాములు, అబూకలాం, వేలాది సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు ఓట్లూ ఫ్యాన్‌పై వేయండి

కంకిపాడు: ఏ కష్టం వచ్చినా మీకు తోడుగా ఉంటా.. మీ సమస్యలకు పరిష్కారం చూపుతా.. మీ కుటుంబ సభ్యుడిగా నిలుస్తా.. మనందరం జగనన్నకు బాసటగా నిలుద్దాం.. అప్పుడే సంక్షేమ రాజ్యం సాధించుకోగలమని మంత్రి జోగి రమేష్ అన్నారు. పెనమలూరు సెంటరులో నిర్వహించిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడారు. ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. చంద్రబాబు వెన్నుపోటుదారుడని విమర్శించారు. మామ ఎన్టీఆర్‌తో మొదలు పెట్టి హరికృష్ణ, పురంధేశ్వరి, పార్థసారథి, కొనకళ్ల నారాయణ ఇలా ఎందరినో తన రాజకీయ జీవితంలో అడుగడుగునా ప్రతి ఒక్కరినీ వెన్నుపోటు పొడుస్తున్న వ్యక్తి చంద్రబాబే అని ఎద్దేవా చేశారు. పెనమలూరు సీటు ఇస్తానంటే నమ్మి పార్టీ ఫిరాయించిన పార్థసారథిని నూజివీడు పంపి వెన్నుపోటు పొడవటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మచిలీపట్నం ఎంపీ సీటు కొనకళ్ల నారాయణరావుకు ఇవ్వకుండా మోసం చేయటం కాదా? అని నిలదీశారు. మోసం, వెన్నుపోట్లు అలవాటుగా ఉన్న చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్టేనని స్పష్టం చేశారు. కుప్పం వదిలి చంద్రబాబు పెనమలూరు స్థానం నుంచి పోటీ చేస్తాడనే ప్రచారంతో జగనన్న తనను పెనమలూరుకు పంపారని మంత్రి జోగి అన్నారు. తీరా రెండు నెలల వరకూ సీటు ఖరారు కాక గుక్కపెట్టి ఏడ్చిన బోడె ప్రసాద్ ఈ రోజు ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. బోడె ప్రసాద్ తనకు ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ కాదని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమన్నారు.



క్రేన్‌పై అభిమానుల కోలాహలం



గుర్రాలపై సవారీ చేస్తున్న జోగి రమేష్ తనయులు



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్



మేము సైతం అంటున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాని

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం



ప్రజలకు అభివాదం చేస్తున్న వంశీమోహన్

గన్నవరం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమ పాలన సాధ్యమైందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత సుందరయ్యనగర్‌లో ప్రారంభమైన ప్రచారం యాదవులబజార్, దిమ్మ సెంటర్, వడ్డర్ల బజార్ మీదుగా కేసరపల్లి గ్రామానికి చేరుకుంది. అడుగడుగునా వంశీమోహన్‌కు ప్రజలు పూలవర్షం కురిపిస్తూ, హారతులు పడుతూ అపూర్వ స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి

ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో సంక్షేమ పథకాలు అమలులో అర్హులకు అన్యాయం చేసిందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వం నివేశన స్థలాలు పంపిణీ చేయడంతో పాటు గృహ నిర్మాణాలు చేపట్టిందన్నారు. జగనన్న కాలనీకి రహదారి కోసం ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పేదలకు అన్ని రకాల అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఉపసర్పంచి గడ్డం అంకమ్మ, ఎంపీటీసీ మరీదు లక్ష్మీదుర్గ, గ్రామ పార్టీ నేతలు బొడ్డు అంజనేయవరప్రసాద్, జంపన బుజ్జి, సురేష్, పుష్పానాథం తదితరులు పాల్గొన్నారు.



కేసరపల్లిలో ప్రచారం చేస్తున్న వంశీమోహన్

వంశీకి ఘన స్వాగతం పలికిన కేసరపల్లి ప్రజలు

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్ చేపట్టిన పాదయాత్రకు ప్రజలు జననీరాజనాలు పలికారు. బుద్దవరం రోడ్డు వద్ద ఆయనకు గ్రామ పార్టీ నేతలు గజమాలతో స్వాగతం పలికారు. వంశీతో పాటు పార్టీ రాష్ట్ర వైద్య విభాగం మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం బీసీ ఏరియా, బాబూజగ్జీవన్ రామ్‌నగర్, అంబేద్కర్‌నగర్, అప్పారావుపేట వరకు కొనసాగిన ప్రచారం కొనసాగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొలుసు మోహన్‌యాదవ్, పార్టీ నేతలు లాకా వెంగళరావుయాదవ్, మెండెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



వంశీమోహన్ తరుపున ఆర్వోకు నామినేషన్ అందజేస్తున్న అనగాని రవి, తోట వెంకయ్య

గన్నవరం: గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం అత్యధికంగా తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ మరో సెట్ నామినేషన్ వేశారు. ఆయన తరుపున ఎంపీపీ అనగాని రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, ఉంగుటూరు మండల పార్టీ అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఆర్వో గీతాంజలిశర్మకు అందజేశారు. ర్యాలీగా వచ్చిన టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మరో సెట్ నామినేషన్‌ను సమర్పించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పాట్లూరి రవీంద్రకుమార్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా తాడంకి జగదీష్ రామచంద్రరావు నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, వల్లభనేని మోహన్ వంశీకృష్ణ, సర్నాల విజయదుర్గ(బీజేపీ రెబల్), పాట్లూరి శ్రీదేవి నామినేషన్లు సమర్పించారు.

పెనమలూరులో ఐదు నామినేషన్లు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా జోగి రమేష్ నామినేషన్ వేశారు. ఈ మేరకు జోగి రమేష్ పెనమలూరులో రిటర్నింగ్ అధికారి డి.రాజుకు నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ సమయంలో జోగి రమేష్, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా జొన్నలగడ్డ సతీష్, జయ్‌మాత భారత్ పార్టీ నుంచి మారదాని విజయ, టీడీపీ నుంచి బోడెప్రసాద్ మరో సెట్ నామినేషన్లు వేశారు. నామినేషన్లు గురువారంతో చివరి తేదీ అని, మధ్యాహ్నం 3 గంటల లోపు వచ్చే నామినేషన్‌లు మాత్రమే స్వీకరిస్తామని ఆర్వో డి.రాజు తెలిపారు.

నేడు వంశీమోహన్ నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గురువారం భారీ ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్ సమర్పించనున్నట్లు నియోజకవర్గ పార్టీ కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక దావాజిగూడెం రోడ్డులోని కల్యాణి టవర్స్‌లోని వంశీమోహన్ నివాసం నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం ప్రదర్శనగా తరలివెళ్లి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వంశీమోహన్ నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు.

వంశీ నామినేషన్ ర్యాలీకి తరలిరండి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా వల్లభనేని వంశీ నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, పిలుపునిచ్చారు.

విజయవాడరూరల్: వంశీమోహన్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవాడ రూరల్ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలంనేని రంగారావు, మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడి, గన్నవరం నియోజకవర్గం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్‌వీఆర్ కోరారు. గురువారం ఉదయం 9 గంటలకు వంశీమోహన్ ఇంటి వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

స్వర్ణభారత్‌లో 28 నుంచి ఉచిత హోమియో వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఈ నెల 28 నుంచి మే ఒకటో తేదీ వరకు డాక్టర్ జీవీ చలపతి మెమోరియల్ హోమియోపతిక్ సెల్ఫ్ రిలయన్స్ ఫోరం సౌజన్యంతో నాలుగు రోజుల ఉచిత హోమియోపతి వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు పీవీ సత్యనారాయణరావు ట్రస్ట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తామన్నారు. అలాగే ప్రతి రెండు నెలలకు ఒక నాలుగు రోజులు హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 94912 21119, 94403 25670 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: ఈ వేసవిలో గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నిడమానూరు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం పూర్తయిన పైప్‌లైన్ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రస్తుతం 4 వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ట్యాంకులతో పాటు 17 మోటారు బోర్ల సహాయంతో తాగునీరును అందిస్తున్నామన్నారు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో కూడా సురక్షిత తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్ విస్తరణ పనులు ప్రారంభించి పూర్తి చేశామని చెప్పారు. అవసరమైన నూతన మోటారు బోర్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పచ్చిరొట్ట సాగుతో భూములు సారవంతం



సూరంపల్లిలో పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ సుధారాణి, అధికారులు

గన్నవరంరూరల్: పచ్చిరొట్ట సాగుతో భూములు సారవంతమవుతాయని మచిలీపట్నం రైతు శిక్షణా కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ జ్యోతి రమణి తెలిపారు. సూరంపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె రైతు శిక్షణా కేంద్రం సైంటిస్ట్ సుధారాణి, ఏడీఏ శ్రీనివాసరావుతో కలిసి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు తమ పంట భూముల్లో వ్యవసాయ శాఖ చేత మట్టి నమూనాలు పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్ష తరువాత వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల దీర్ఘకాలంలో దుష్ఫలితాలు వస్తాయన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వ్యవసాయాధికారుల సూచనల మేరకు రసాయనిక ఎరువులు వాడాలన్నారు. పచ్చిరొట్ట ఎరువు భూమికి మేలు చేస్తుందని చెప్పారు. ప్రతి రైతు ఖరీఫ్ సీజన్‌కు ముందుగా పచ్చిరొట్ట సాగు చేయాలని చెప్పారు. జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట సాగు చేసి భూమిలో కలియదున్నాలన్నారు. దీంతో భూమికి పోషకాలు, నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతాయని చెప్పారు. ఎరువుల వాడకం తగ్గించుకోవటం ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. వీఏఏ రవితేజ, వీహెచ్ దీక్షా తదితరులు పాల్గొన్నారు.

మల్లవల్లి ఇండస్ట్రీయల్ పార్కుకు రాజమార్గం



మల్లవల్లి ఏపీఐఐసీ వద్ద నిర్మించిన రహదారి

- 150 అడుగుల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రహదారి
- రూ.15 కోట్లతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం
- 3.8 కిలో మీటర్ల మేర మీర్జాపురం టూ మల్లవల్లి రోడ్డు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రీయల్ పార్కు, మెగా ఫుడ్ పార్కులకు వెళ్లే అప్రోచ్ రోడ్డును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సిద్ధం చేసింది. 216 హెచ్ జాతీయ రహదారి నుంచి మల్లవల్లి వరకు సువిశాలమైన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని రూ.15 కోట్లతో నిర్మించారు. ఇప్పటికే మోడల్ ఇండస్ట్రీయల్ పార్కు, మెగా ఫుడ్ పార్కులో పలు పరిశ్రమలు ఏర్పాటు చేయటంతో శరవేగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రాజమార్గాన్ని ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లాలోని నూజివీడు మండలం మీర్జాపురం వద్ద ఎంఎన్‌కే రహదారి (216హెచ్ హైవే) నుంచి 3.8 కిలో మీటర్లు మేర ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించారు. దీని కోసం మీర్జాపురం, మల్లవల్లి గ్రామాల్లో దాదాపు 39 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. 150 అడుగుల వెడల్పుతో సెంట్రల్ లైటింగ్, రహదారికి ఇరువైపులా పచ్చని మొక్కలు, డ్రెయినేజీ సదుపాయాలతో ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రీయల్ పార్కు సుందరంగా తయారైంది. గతంలో మీర్జాపురం, కొత్త మల్లవల్లి గ్రామాల మీదగా ఇరుకు రోడ్డులో భారీ వాహనాలు ఇండస్ట్రీయల్ పార్కుకు వెళ్లాల్సి వచ్చేది. అశోక్ లేలాండ్, హెరిటేజ్, పార్లే, మోహన్ స్పిన్‌టెక్స్, శివతార వంటి పెద్ద కంపెనీలతో పాటుగా పలు ఫుడ్, ఆగ్రో, ఫీడ్స్, ఆటో మొబైల్, బేవరేజ్ ఉత్పత్తులను తయారు చేసే సంస్థలు మల్లవల్లిలో ఏర్పాటయ్యాయి. నిత్యం అధికసంఖ్యలో ఆయా ఫ్యాక్టరీలకు భారీ వాహనాల రాకపోకలు సాగించటంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం 150 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించింది.